సాక్షి
నిర్మల్

సోమవారం : 27 : మే : 2024



రైతులూ జాగ్రత్త..!
మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. విత్తనాల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.
8లో▸



నిర్మాణాలు సరే.. నిర్వహణ ఏది?
తానూరు మండలంలోని వివిధ గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటితొట్టీలు నిర్వహణలేక నిరుపయోగంగా మారాయి.
9లో▸

గరిష్టం/కనిష్టం
43.8 /31.6

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు అమలు చేయాలి’



మాట్లాడుతున్న సునారికారి రాజేశ్

ఖానాపూర్: బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతన ఒప్పందం ఏప్రిల్ 30తో ముగిసిందన్నారు. కొత్త వేతన ఒప్పందం కోసం తమ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీస్ ఇవ్వగా ప్రభుత్వం ఈ నెల 25న బీడీ యాజమాన్య సంఘాలతో చర్చలు జరిపిందన్నారు. ఈ చర్చల్లో బీడీ ప్యాకర్లకు నెలకు రూ.3,650, నెలసరి ఉద్యోగులకు రూ.1,700 చొప్పున వేతనాలు పెరిగాయన్నారు. బీడీలు చుట్టే కార్మికులకు వేయి బీడీలకు రూ.4.25 పైసల చొప్పున కూలి రేట్ల పెంపునకు ఒప్పందం కుదిరిందన్నారు. పెరిగిన వేతనాలు మే 1 నుంచి అమలు చేయాలని, లేనిపక్షంలో బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దుర్గం లింగన్న, చిన్న రాజన్న, తదితరులు పాల్గొన్నారు.


‘గజ్జలమ్మ’కు పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేష్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకి సేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కడార్ల హరిప్రసాద్, బోయ సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, తాటి శివ, చిప్ప సంజీవ్, గంగాధర రాజు, పల్లికొండ గజేందర్, భూమన్న, గజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కడెం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

కడెం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం డీఎస్పీ గంగారెడ్డి తనిఖీ చేశారు. ఇటీవల స్టేషన్‌లో నమోదైన కేసుల రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పోలీస్ స్టేషన్ ఆవరణలో గార్డెన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐ సైదారావు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



దాగాంలో విరిగిన విద్యుత్ స్తంభం

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గ్రామాన్ని సందర్శించిన విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

అంగన్‌వాడీల ప్రక్షాళన

- టీచర్లు, ఆయాలకు వయో పరిమితి
- 65 ఏళ్లు నిండిన వారికి రిటైర్మెంట్
- జూన్ నుంచి అమలుకు కసరత్తు
- జిల్లాలో ఖాళీ కానున్న 123 పోస్టులు
- కొత్త వారిని నియమించే అవకాశం

జిల్లా వివరాలు		
ప్రాజెక్టులు	:	4
సెక్టార్లు	:	37
మెయిన్ అంగన్‌వాడీలు	:	816
మినీ అంగన్‌వాడీలు	:	110

ప్రాజెక్టుల వారీగా సిబ్బంది		
ప్రాజెక్టు	అంగన్‌వాడీ టీచర్లు	హెల్పర్లు
భైంసా	11	14
ఖానాపూర్	0	21
ముధోల్	7	25
నిర్మల్	9	36



గుల్జార్ మార్కెట్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ప్రక్షాళనకు సిద్ధమైంది. దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తూ వయోభారంతో ఉన్న టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా వాయిదా పడింది. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడంతో అంగన్‌వాడీల వివరాలు సేకరిస్తోంది. ఏప్రిల్ 30వ తేదీ వరకు జిల్లాలో 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 123 మంది ఉన్నారు. వీరంతా ఉద్యోగ విరమణ పొందనున్నారు.

123 మంది గుర్తింపు..

ప్రభుత్వ ఆదేశాలతో మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు జిల్లాలో 65 ఏళ్లు పైబడిన టీచర్లు, ఆయాల వివరాలు సేకరిస్తున్నారు. పదో తరగతి మెమో, టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్ ఆధారంగా వయస్సును నిర్ధారిస్తున్నారు. ఇప్పటికే ఐసీడీఎస్ అధికారుల వద్ద ఎంప్లాయ్ మేనేజ్‌మెంట్ సిస్టంలో వివరాలు సైతం ఉన్నాయి. టీచర్ల వయస్సు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. ఆయాలు పెద్దగా చదువుకోక పోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎంప్లాయ్ మేనేజ్‌మెంట్ సిస్టంలో ఉన్న వివరాలకు ఆయాల ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు పొంతన లేకుండా ఉంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ సర్జన్ వద్ద నుంచి వయస్సు నిర్ధారణ పత్రాలు తేవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా అప్పటికే అధికారులు సేకరించిన వివరాల మేరకు జిల్లాలో 65 ఏళ్లు పైబడి రిటైర్మెంట్‌కు సిద్ధంగా ఉన్నవారు టీచర్లు 27 మంది, ఆయాలు 96 మందితో కలిపి మొత్తంగా 123 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. వీరంతా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే కొంతమంది మాత్రం పుట్టినతేదీ సరిగాలేని కారణంగా తాము తొందరగా విధుల నుంచి తప్పుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాలంటూ కొందరు అధికారులను ఆశ్రయించారు. వయస్సు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. అలాంటి వారిని జిల్లా ఆస్పత్రిలో వయస్సు నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

926 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, ముధోల్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 816, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 110 ఉన్నాయి. వీటిలో ప్రధాన సెంటర్లలో టీచర్, ఆయా, మినీ కేంద్రాల్లో టీచర్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల మినీ సెంటర్లలో కూడా టీచర్, ఆయాలు ఉండాల్సిందేనని ప్రభుత్వం చెప్పినా ఇంకా పోస్టులు భర్తీ చేయలేదు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ సెంటర్లలో రిటైర్మెంట్ ప్రక్రియ లేకపోవడంతో వయస్సు పైబడిన వారి స్థానంలో కుటుంబ సభ్యులు విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే టీచర్లు, ఆయాలు తమకు ఉద్యోగ విరమణ చేపట్టి ప్రయోజనాలు కల్పించాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేల బెనిఫిట్ కల్పిస్తామని ప్రకటించింది.

గందరగోళం..

ఐసీడీఎస్ అధికారుల వద్ద ఎంప్లాయ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈఎంఎస్)లో ఉన్న వివరాలకు ఆయాల వద్ద ఉన్న వివరాలకు పొంతన లేకుండా పోయింది. అంగన్‌వాడీ టీచర్లకు పదో తరగతి సర్టిఫికెట్లు ఉండగా ఆయాలు చదువు కోకపోవడంతో వారి వయస్సు నిర్ధారణ కోసం అధికారులు ఆధార్ కార్డులు సేకరిస్తున్నారు. అందులో కూడా చాలామంది వయస్సు హెచ్చుతగ్గులు ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సివిల్ సర్జన్ వద్ద నుంచి వయస్సు నిర్ధారణ పత్రాలు తేవాలని చెబుతున్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై చిన్నచూపు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన వారు అనేకం. అలాంటి వారికి ప్రభుత్వం నుంచి అనుకున్న మేర సాయం అందడం లేదు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో హఠాత్తుగా ఉద్యోగాలు కోల్పోతే మా పరిస్థితి ఏమిటని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ. 50 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ప్రభుత్వ సాయం ఏమాత్రం సరిపోదని టీచర్లు, ఆయాలు అంటున్నారు. అంగన్‌వాడీలకు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వానికి జాబితా..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్, ఆయాలను గుర్తిస్తున్నాం. అర్హులైన వారి జాబితా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఏప్రిల్ 30 వరకు 65 ఏళ్ల వయస్సు పైబడిన వారి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాలో 123 మంది ఉద్యోగ విరమణ పొందనున్నారు. – ఏ.నాగమణి, డీడబ్ల్యూవో

సన్నబియ్యంపై ఆశలు..!



- రేషన్ దుకాణాల్లో పంపిణీకి యోచన
- అమలు చేస్తే కార్డుదారులకు ప్రయోజనం
- దొడ్డు బియ్యం అక్రమ రవాణాకు చెక్

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలు
ఏఎఫ్‌ఎస్‌సీ కార్డులు : 12,672
ఎఫ్‌ఎస్‌సీ కార్డులు : 1,95,758
అంత్యోదయ కార్డులు : 32
మొత్తం రేషన్ కార్డులు : 2,08,462
లబ్ధిదారులు : 6,41,411
అవసరమైన బియ్యం కోటా : 40,56,074 కిలోలు

భైంసాటౌన్: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని, అందుకే సన్నవడ్ల సాగు ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ప్రకటించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెల్లరేషన్ కార్డుదారులు సన్నబియ్యం పంపిణీపై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో దొడ్డురకం బియ్యం అందిస్తుండగా వాటిని తినలేక చాలామంది లబ్ధిదారులు బియ్యం అమ్ముకుంటున్నారు. రైతులు ఎక్కువగా దొడ్డు రకం ధాన్యం సాగు చేస్తుండడంతో ఇప్పటి వరకు ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు కేటాయించేది. మిల్లర్లు బియ్యం మరాడించి ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖకు పంపితే వాటిని రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తోంది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు.

6.41 లక్షల మందికి ప్రయోజనం...

జిల్లాలో తెల్లరేషన్ కార్డులు 2,08,462 ఉండగా 6,41,411 మంది లబ్ధిదారులున్నారు. వీరికి ప్రతినెలా యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున అందిస్తున్నారు. దీంతో నెలకు 40,560 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతోంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా దొడ్డుబియ్యం పంపిణీ చేస్తుండగా చాలావరకు నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో చాలామంది లబ్ధిదారులు వాటిని తినలేక కిలోకు రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయించుకుంటున్నారు. మార్కెట్‌లో సన్న బియ్యం కిలోకు రూ.50 నుంచి రూ.70 వరకు ధర పలుకుతున్నాయి. దీంతో ఆర్థికంగా భారమైనా సన్నబియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా నెలకు 25 కిలోల బస్తాకు రూ.1300 నుంచి రూ.1700 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తే పేదలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

అక్రమ రవాణాకు చెక్...

ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో అందిస్తున్న దొడ్డుబియ్యాన్ని లబ్ధిదారులు విక్రయించుకోవడంతో అక్రమ రవాణకు తరలుతున్నాయి. కొందరు రైస్‌మిల్లర్లు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం మరాడించకుండా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. దళారుల ద్వారా లబ్ధిదారుల నుంచి సేకరించిన దొడ్డు బియ్యాన్నే తిరిగి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి దళారులకు, వారి నుంచి రైస్‌మిల్లులకు, అక్కడి నుంచి ఎఫ్‌సీఐకి, మళ్లీ రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకే రీసైకిల్ అవుతోంది. ఫలితంగా నాసిరకం బియ్యం పంపిణీ అవుతోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తే లబ్ధిదారులు విక్రయించాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు చెక్ పడుతుంది.



భైంసాటౌన్: 2006-07 బ్యాచ్ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–2002 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు 22 సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పేరిట వడ్యాల్‌లోని రాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతా కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత స్మృతులను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతికి కారకులైన గురువులకు పూలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటి గురువులు కిషన్‌రావు, నాజీర్ అహ్మద్, మోహన్‌రావు, అరవింద్ కుమార్, లక్ష్మణ్, నరేందర్, మంజుల, మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీసరస్వతి శిశుమందిర్‌లో 2006–2007 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి మిత్రులంతా ఒక్కచోట చేరి పాఠశాల రోజులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు రూ.20వేల విలువైన సౌండ్ సిస్టం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉమ్మడి ఆదిలాబాద్ శిశు మందిరాల అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రెడ్డి, విభాగ్ సహ కార్యదర్శి సరికొండ దామోదర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జీలకర రాజేశ్వర్, డా.మహిపాల్, ధర్మపురి సుదర్శన్, ఉపాధ్యాయులు నాగభూషన్, దత్తాత్రి, నితిన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోజన్న, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: 2001-2002 బ్యాచ్ విద్యార్థులు

‘కోనోకార్పస్’ కోరల్లో!

- పక్షులు వాలవు.. పశువులు తినవు
- పర్యావరణానికి ప్రయోజనం శూన్యం
- పువ్వుల రేణువులతో అనారోగ్యం
- జిల్లాలో విపరీతంగా పెరిగిన చెట్లు
- ఇప్పటికే ఈ చెట్లపై నిషేధం..
- అయినా తొలగించని అధికారులు, పాలకులు



కోనోకార్పస్ చెట్ల పువ్వులు, కాయలు



జిల్లా కేంద్రంలోని మంచిర్యాలరోడ్డులో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు



ఇటీవల పువ్వులు, కాయలున్న వరకు కొమ్మలు కొట్టేసిన చెట్లు

నిర్మల్: సాధారణంగా అడవులను, చెట్లను ఎవరైనా నరికేస్తే.. పర్యావరణ ప్రేమికులు, సాధారణ పౌరులూ ఆందోళన చెందుతుంటారు. కానీ ఇప్పుడు ఏపుగా, పచ్చగా పెరుగుతున్న ‘కోనోకార్పస్’ చెట్లను చూస్తే పర్యావరణ వేత్తలే హడలిపోతున్నారు. ‘వద్దు బాబూ.. వీటిని వెంటనే తొలగించండి..’ అంటున్నారు. ఎందుకంటే.. ఇవి అంత ప్రమాదకరంగా మారుతున్నాయి. వీటితో పర్యావరణానికి మేలు జరగకపోగా.. ప్రజారోగ్యానికి హాని కలుగుతోంది. ఇప్పటికే ప్రపంచంలోని ఎన్నో దేశాలు, దేశంలోని చాలా రాష్ట్రాలు కోనోకార్పస్ చెట్లను నిషేధించాయి. చాలా దేశాల్లో కూకటివేళ్లతో పెకిలించి వేశాయి. జిల్లాల్లో మాత్రం ఈ చెట్లు వేళ్లానుకుని పోయాయి.

హరితహారం తెచ్చిన శాపం..

గత ప్రభుత్వం చేపట్టిన హరితహారం అద్భుతమైన కార్యక్రమం. కానీ.. అదే శాపంగానూ మారింది. ప్రభుత్వం పెట్టిన గడువు, నిబంధనలకు స్థానిక అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మంచి చెడులను ఆలోచించకుండా త్వరగా పెరిగే మొక్కలను తీసుకువచ్చి విరివిగా నాటేశారు. ఇప్పుడు వాటి దుష్ఫలితాలు బయటపడుతున్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలోకి వచ్చింది కోనోకార్పస్ మొక్క. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులపై డివైడర్ల మధ్యలో మొత్తం ఇవే మొక్కలు నాటారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లోనూ వీటినే పెంచారు. పచ్చగా, ఏపుగా పెరగడంతో అంతా ‘వావ్..’ అన్నారు. ఇప్పుడు పువ్వులు, కాయలూ కాస్తుండటం, అవి ప్రజారోగ్యానికి ప్రమాదకారిగా మారుతున్నాయని తెలియడంతో ‘ఈ చెట్లు వద్దు బాబో..’ అంటున్నారు.

పుప్పొడితో పరేషాన్..

కోనోకార్పస్ చెట్ల పువ్వుల పుప్పొడి పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. దీని కారణంగా మనుషుల్లో అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులు, అస్తమా వంటివి వస్తున్నట్లు తేలింది. ఈచెట్లు ఎంత ప్రమాదకరమంటే వీటి వేళ్లు భూమిలోతులోకి వెళ్లి బలంగా నాటుకుంటాయి. ఈక్రమంలో పునాదులతోపాటు భూమిలో వేసిన కేబుళ్లు, పైపులనూ ఇది ధ్వంసం చేస్తోంది. ఇక ఈ మొక్కలు హరితహారంలో పెంచడానికి మరోకారణం.. వీటిని పశువులు తినవు. కనీసం పక్షులు గూళ్లు కూడా పెట్టవు. వీటి పువ్వులు, పుప్పొడిపై సీతాకోక చిలుకలు కూడా వాలవు. అంటే.. ఆ చెట్టు ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్రంలో నిషేధం..

భూమి లోతు వరకూ నాటుకుపోవడంతో కోతకు గురికాకుండా ఉంచే కోనోకార్పస్ చెట్లను తీరప్రాంతాల్లో విరివిగా పెంచారు. ప్రపంచంలోని చాలా దేశాలు మొదట్లో వీటిని విరివిగా పెంచాయి. తర్వాత వీటివల్ల కలుగుతున్న అనర్థాలు తెలియడంతో మూలాలతో సహా పెకిలించి వేశాయి. దుబాయ్‌లో వీటిని విస్తారంగా పెంచారు. తర్వాత ఎడారి దేశం సైతం వీటిని పీకేయించింది. మన దేశంలోని చాలా రాష్ట్రాలు కూడా వీటిని నిషేధించాయి. తెలంగాణలోనూ ఈ మొక్కలను హరితహారంలో నాటవద్దని చెప్పినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

కొమ్మలు కాదు.. చెట్లనే తొలగించాలి

ఎక్కడా పెంచని కోనోకార్పస్ మొక్కలను జిల్లాలో మాత్రం నిత్యం నీళ్లు పోసి పెంచుతున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో ఈ మొక్కలు ఉన్నాయి. రియల్‌ఎస్టేట్ నిర్వాహకులు వెంచర్లలో వీటిని ఎక్కువగా పెంచారు. ఇప్పుడు ఈ చెట్లు అంతటా పువ్వులు, కాయలు కాసే దశకు చేరాయి. తరచూ వీటిపై ఫిర్యాదులు వస్తుండటంతో మున్సిపాలిటీలు, పంచాయతీలు ఆ పువ్వులు, కాయలు కాసే కొమ్మలను కొట్టేస్తున్నాయి. కానీ.. దీనివల్ల ప్రతీ ఏడాది రెండుసార్లు ఖర్చు తప్ప.. ప్రజారోగ్యానికి ఎలాంటి ఉపయోగం లేదన్న వాదన పెరుగుతోంది. వీటిని మొత్తానికే తొలగించాలన్న డిమాండ్ బలపడుతోంది.

మొత్తానికే తొలగించాలి



జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రోడ్డులో ఇటీవల కోనోకార్పస్ చెట్ల కొమ్మలను మున్సిపల్ సిబ్బంది కొట్టేశారు. ఇలా ఏడాదికి రెండు సార్లు చేయడం వల్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు ఆ చెట్లవల్ల ప్రజారోగ్యం దెబ్బతింటోంది. కోనోకార్పస్ చెట్లను మొత్తానికే తీసివేయాలి.
– దశరథ పోశెట్టి, నిర్మల్

నష్టాలే ఎక్కువ..



కోనోకార్పస్‌తోపాటు ఎనిమిది ఆకుల చెట్టు, గన్నేరుచెట్లతో లాభాల కంటే నష్టాలే ఎక్కువ. ఈ చెట్లను చాలాదేశాలు, రాష్ట్రాలు నిషేధించాయి. స్థానికంగా అవగాహన లేకపోవడంతోనే విరివిగా పెంచుతున్నారు. పర్యావరణంతోపాటు పశుపక్షాదులు, ప్రజారోగ్యానికీ ఇవి ప్రమాదకరం. వీటిని తొలగించాలి. – డాక్టర్ వెల్మల మధు, అసోసియేట్ ప్రొఫెసర్, భైంసా డిగ్రీ కళాశాల

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



పగులగొట్టిన హుండీ

లోకేశ్వరం: మండలంలోని హద్గాం గ్రామంలోని మల్లన్న దేవుని ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది.ఆదివారం ఉదయం పూజ కోసం వెళ్లినవారు చోరీ జరిగిందని గ్రామస్తులకు సమాచారం అందించారు. హుండీ తాళం పగులగొట్టి డబ్బులను ఎత్తుకెళ్లారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టపగలే దోపిడీ



బార్ సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల కల్పన బార్ వద్ద శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో దోపిడీ జరిగింది. బేల మండలానికి చెందిన మెస్రం కైలాస్ మద్యం సేవించేందుకు బార్‌కు వచ్చాడు. అతని వద్ద డబ్బులు ఉన్నాయని గమనించి ఓ దొంగ మరో ముగ్గురు దొంగలకు సమాచారం అందించారు. వారు ఆటోలో అక్కడికి చేరుకున్నారు. బార్ నుంచి బయటకు కైలాస్‌ను ఆటోలో ఎక్కించేందుకు ప్రయత్నించారు. ఆయన ససేమిరా అనడంతో దాడి చేసి రూ.10 వేల నగదు లాక్కొని ఆటోలో పరారయ్యారు. బార్‌కు సంబంధించిన సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లోని చోరీకి గురైన రాగి వైరు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి అందులో రాగి వైర్లను చోరీ చేశారు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు, ఇతర వస్తువుల విలువ రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఉంటుందని శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ మామిడి గంగవ్వ, సభ్యులు విద్యుత్ ఏఈ శివప్రసాద్‌లు ఆదివారం స్థానిక ఎస్సై రాజుకు ఫిర్యాదు చేశారు.

మరో వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌లో నకిలీ విత్తనాల విక్రయాల్లో పట్టుబడ్డ ముఠాలో మరో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. సిద్దిపేటకు చెందిన మణికంఠ పరారీలో ఉండగా, ఆదివారం పట్టుకున్నామన్నారు. ఇదివరకే ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

రైతులూ జాగ్రత్త..!

- విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు

జిల్లాల వారీగా..

జిల్లా	సాగు విస్తీర్ణం
మంచిర్యాల	3.42 లక్షలు
ఆదిలాబాద్	5.56 లక్షలు
నిర్మల్	4.30 లక్షలు
కుమురంభీం ఆసిఫాబాద్	4.80 లక్షలు



బస్తాల్లో పలు కంపెనీల పత్తి విత్తనాల ప్యాకెట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్/నేరడిగొండ: మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. విత్తనాలు, ఎరువులు సమాకుర్చుకునే సమయం దగ్గరపడింది. ఈ సమయంలో పలు కంపెనీల విత్తనాల, పురుగుల మందుల ప్రచారం జోరుగా ఊపందుకుంది.పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు సాగిస్తున్నాయి. కంపెనీల యాజమాన్యాలు ఉమ్మడి జిల్లాలోని డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్ల ఆఫర్ చేస్తున్నాయి. పత్తి విత్తనాలకు సంబంధించిన కంపెనీలు ఆయా గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. మైక్‌సెట్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లకు చేరుతున్నాయి. ఆయా కంపెనీల వలలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఆకర్షణీయ ప్రకటనలకు లోనుకావద్దు

ఆయా కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు లోబడి విత్తనాలు కొనుగోలు చేయరాదు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో..గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీలపై విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్ని సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. విత్తన కంపెనీపై ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా విత్తనాల్ని ఉత్పత్తి చేసే కంపెనీపై నమ్మకం ఉండాలి.

నాణ్యమైన విత్తనాలు కొనాలి

ప్రభుత్వ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదు తమ వద్ద పెట్టుకోవాలి. బీటీ–3 పేరిట నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

– సురేఖ, మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి

విత్తనాలు కొనేముందు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన ఆధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపర్చాలి
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనే ముందు..

- ఆధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందు కొనే ముందు..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

కళ్లు కనిపించకపోయినా..





హార్మోనియం, తబలా వాయిస్తున్న పాపయ్య

- సంగీత వాయిద్యంలో దిట్ట
- రాణిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాపయ్య

కుంటాల: జీవితంలో ఏదైనా సాధించాలన్న తపన.. సమాజంలో ఏదో ఒకటి సాధించాలన్న లక్ష్యం వారిలో ఉంటుంది. కళ్లు లేకపోయినా తబలా, హార్మోనియం వాయిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. సంకల్పానికి అంగవైకల్యం అడ్డురాదని నిరూపిస్తున్నారు కుంటాల మండలం అంబకంటి గ్రామ వాసి రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపు పాపయ్య.

విద్యార్థి దశ నుంచే..

గజ్జవ్వ–గజ్జన్నల దంపతుల కుమారుడు పాపయ్య. సుమారు మూడేళ్ల వయస్సులో పోచమ్మ (అమ్మవారు) సోకడంతో రెండు కళ్లు కోల్పోయాడు. గ్రామానికి చెందిన దివంగత పోతన్‌రావు సహకారంతో హైదరాబాద్ వెళ్లాడు. పాతబస్తీ సాలార్జంగ్ మ్యూజియం బసంత హవేలీ అంధుల పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించాడు. బ్రెయిలీ విధానం ద్వారా విద్య నేర్చుకున్నాడు. పాఠశాలలో సంగీతం, ఆటలు, వ్యాయామం తరగతులు నిర్వహించేవారు. శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకున్న పాపయ్య తబలా, హార్మోనియం వాయించడంలో ప్రావీణ్యం పొందాడు. చంచల్‌గూడ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. బిస్కెట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ డిగ్రీ చదువుకునే సమయంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా 1985లో టీటీసీలో అర్హత సాధించాడు.

తనదైన శైలిలో బోధన

అంధుల పాఠశాలలో బ్రెయిలీ లిపి నేర్చుకుని పాపయ్య టీచర్‌గా 37 ఏళ్లపాటు విద్యాబోధన అందించారు. విద్యార్థులకు భాష, ఉచ్ఛరణ, పరిజ్ఞానం పెంపొందించాలన్న లక్ష్యంతో తనదైన శైలిలో బోధనకు రూపకల్పన చేశాడు. పాఠ్యాంశాల్లోని వరుసలను విద్యార్థులతో చదివించేవాడు. అదివిన్న తర్వాత వారికి అర్థమయ్యేలా బోధించడం ద్వారా ప్రత్యేకత చాటుకున్నారు.

ఇంపైన సంగీతం

తనకు కళ్లు లేకపోయినా..తను నేర్చుకున్న కళలతో ఇతరులకు ఇంపైన సంగీతాన్ని అందిస్తున్నారు. పాపయ్య తన స్నేహితులతో కలిసినప్పుడు, ఇంట్లో జరిగే శుభకార్యాలలో తబలా, హార్మోనియం వాయించడంతో అది విని, చూసిన పలువురు మంత్ర ముగ్ధులవుతున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా తనకంటూ ప్రత్యేకత చాటుతూ ముందుకు సాగుతున్న పాపయ్యను పలువురు అభినందిస్తున్నారు.

లక్ష్యంతో ముందుకెళ్లాలి



ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధన చేయడం సంతృప్తినిచ్చింది. జీవితంలో సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్లాలి. తబలా, హార్మోనియం చక్కగా వాయించడంతో అందరూ అభినందించడం సంతోషంగా ఉంది.

– గోపు పాపయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, అంబకంటి

ఇలేగాంలో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఊరి పక్కనున్న చెరువు ఎండిపోయింది. ఆదివారం అందులో ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలకు నిప్పంటుకుని పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. గ్రామస్తులు అందించిన సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు.

పొట్టపెల్లి(కె)కి తప్పిన ప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

- వరిగడ్డికి నిప్పపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- క్షణాల్లో వ్యాపించిన మంటలు
- మంటలార్పిన యువకులు, అగ్నిమాపక సిబ్బంది



పొట్టపెల్లి(కె) వద్ద అలుముకున్న పొగ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామానికి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వరిగడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గాలి వేగానికి క్షణాల్లో మంటలు గ్రామ సమీపం వరకు వ్యాపించాయి. బీసీ కాలనీకి పది అడుగుల దూరం వరకు మంటలు వచ్చాయి. ఇళ్లకు నిప్పు అంటుకుంటుందని పలువురు యువకులు, పెద్దలు ధైర్యం చేసి చెట్లకొమ్మలు, బిందెలు, బకెట్లలో నీటితో మంటలార్పేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకున్నారు. యువకులు, గ్రామస్తుల సహాయంతో మంటలార్పేందుకు చర్యలు చేపట్టారు. దాదాపు 2 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. కాగా, అగ్ని ప్రమాదంతో పలువురు రైతులకు చెందిన వరిగడ్డి దగ్ధమైంది. దాదాపు రూ.30 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది ఏఎస్సై అశోక్ కుమార్, డ్రైవర్ ఆపరేటర్ హుస్సేన్, ఫైర్‌మెన్‌లు అజయ్ కుమార్, రాజు, ఏఎస్సై నారాయణరెడ్డి, పీసీలు అశోక్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగం లేదని మనస్తాపంతో ఆత్మహత్య

- పిప్పల్‌కోటిలో ఘటన
- కేసు నమోదు



నిఖిల్ (ఫైల్)

తాంసి: డిగ్రీ చదివినా ఎలాంటి ఉద్యోగం లేదని మనస్తాపంతో యువకుడు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో ఈ ఘటన చోటు చేసుకుంది. తాంసి ఎస్సై శివరాం కథనం ప్రకారం.. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తోన్పు నిఖిల్ (24) డిగ్రీ చదివాడు. కొన్నినెలలుగా ప్రైవేట్ ఫర్టిలైజర్ కంపెనీలో పనిచేశాడు. ఈ సంవత్సరం ఉద్యోగం పోవడంతో ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పని చేస్తున్నాడు. ఉద్యోగం లేదని నిఖిల్ బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. బంధువులకు ఫోన్ చేసి ఆరాతీశారు. ఈక్రమంలో తాంసి మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టు వద్ద యువకుడి బైక్‌తోపాటు చెప్పులు వదిలేసి ఉండడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని కుటుంబీకులకు సమాచారం అందించారు. రాత్రి కావడంతో ఆదివారం ఉదయం గజఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఎస్సై పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. తండ్రి విశ్వనాథ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



లక్ష్మి

సోన్: గుర్తుతెలియని పురుగుల తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని బొప్పారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మి (33), రాజు భార్యభర్తలు. భర్త తన మాట వినడం లేదని, తోటలోకి సరిగా పనికి రావడం లేదని మనస్థాపం చెందింది. బుధవారం మధ్యాహ్నం లక్ష్మి గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



కడెం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1996-97 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కొండుకూర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలు, మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాగులవాడ శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక దివ్య గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ వేడుకలు చేపట్టారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.





లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి వారు పాల్గొన్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. గురువు లింగారావు దంపతుల పెళ్లిరోజు సందర్భంగా దుస్తులు అందజేశారు. గురువులు గంగారెడ్డి, గంగన్న, లింగారావు, సుధీర్‌కుమార్, పద్మాకర్‌రావు, కమల, రాజేశ్వర్, శ్రీనివాస్, మోహన్‌రావు, దృపతి, రమేశ్, ముత్యం, అపర్ణ, నరేందర్‌రెడ్డి, గంగన్నను సన్మానించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి



కదం ప్రీతి(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్ ఎన్‌టి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కదం ప్రీతి(31) మృతి చెందారు. మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తుండగా, రెండేళ్లుగా పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మృతిచెందారు. దీంతో ఉపాధ్యాయవర్గాలు ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కోతిదాడిలో మహిళకు గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో కోతి ఓ మహిళపై దాడి చేసి గాయపర్చింది. ఇంటి ఆవరణలో జ్యోతి పని చేసుకుంటుండగా, ఆదివారం వానరం దాడి చేసింది. దీంతో ఆమె చేతికి గాయమైంది. అలాగే మరో ఇద్దరిపై దాడి చేయగా, వారికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఏరియా స్పత్రిలో వారికి ప్రథమ చికిత్స అందించారు. కోతుల బెడద నుంచి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఠాకూర్ హోటల్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వడదెబ్బ, మూర్ఛ వ్యాధితో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 35 వరకు ఉంటుందని వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఆవులు మృతి

తాంసి/తలమడుగు: తలమడుగు మండలం లింగి శివారు పొలంలో ఆదివారం రెండు ఆవులు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. మేత కోసం ఆవులు వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని తాంసి మండలం గిరిగాం గ్రామానికి చెందిన బాధిత రైతులు విలాస్, జ్ఞానేశ్వర్ తెలిపారు. అధికారులు పరిహారం అందించాలని కోరారు.